క్లుప్తంగా

పెద్దలను గౌరవించడం సంప్రదాయం

ఎమ్మెల్యే సబితా రెడ్డి



ఎమ్మెల్యే సబితా రెడ్డిని సన్మానిస్తున్న నిరంజన్

పహాడీషరీఫ్: పెద్దలను గౌరవించడం సంప్రదాయమని, విద్యార్థులకు చదువుతో పాటు విలువలను కూడా నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని శ్రీ హర్ష పాఠశాల వార్షికోత్సవంలో శనివారం రాత్రి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ శ్రీరాం కాలనీలోని పేద, మధ్య తరగతిని దృష్టిలో ఉంచుకొని లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో విద్యనందించాలన్నారు. విద్యార్థులు మన సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఉషి కుమారి నిరంజన్, కరస్పాండెంట్ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ స్వప్న, డీన్ కృష్ణారెడ్డి, జల్‌పల్లి కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు

మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య



మాట్లాడుతున్న లక్ష్మయ్య యాదవ్

తుక్కుగూడ: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్‌దే గెలుపు ఖాయమని తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు జిల్లాల లక్ష్మయ్య యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్, బీజేపీలను నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పై వంద రోజుల్లోనే వ్యతిరేకత వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రాజ్‌రెడ్డి, శ్రీనివాస్, క్యామేల్ రాజు, బుచ్చిరెడ్డి, సురేశ్, హరికృష్ణా రెడ్డి, రాజు, సుందరయ్య, సింహారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా గోపాల్‌రెడ్డి

చేవెళ్ల: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా పీసరి గోపాల్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా చేవెళ్ల మండలంలోని పలుగుట్ట గ్రామానికి చెందిన పీసరి గోపాల్‌రెడ్డికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసిన జిల్లా కమిటీ సభ్యులకు, బీజేపీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు అందించే విధంగా పనిచేస్తానని చెప్పారు. రైతుల సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేలా సహకరిస్తామన్నారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకునేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మళ్లీ మోదీనే అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కిసాన్ మోర్చా పని చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాండు రంగారెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఉమాశంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కేశవపల్లి వెంకట్‌రాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మలుపు.. ప్రమాదానికి పిలుపు

కొత్తూరు: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలో ఉన్న మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పెంజర్ల నుంచి సిద్ధాపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో పెంజర్ల జెడ్పీహెచ్‌ఎస్ ఎదురుగా ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు.



శ్రీనగర్‌లో మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశం



ఈ–సిటీ కమాన్ వద్ద డంప్ చేసిన మొరం

జోరుగా మట్టి దందా!

రాత్రి తవ్వి.. ఉదయం తరలింపు

- గుట్టుగా సాగుతున్న వ్యాపారం
- ప్రభుత్వ, ఫారెస్టు భూముల్లో తవ్వకాలు
- రోజుకు రూ. లక్షల్లో అక్రమార్జన
- పట్టించుకోని అధికారులు

తుక్కుగూడ: ఏ వ్యాపారానికైనా డిమాండ్, సప్లయ్ ఆధారంగా కార్యకలాపాలు సాగడం పరిపాటి. డిమాండ్ ఎక్కువైతే ఎక్కువ లాభలు ఆర్జించవచ్చు. ఇదే సూత్రాన్ని అక్రమార్కులు ఫాలో అవుతున్నారు. యథేచ్ఛగా మట్టి, మొరం కొల్లగొడుతున్నారు. ప్రకృతి సంపద హరించుకుపోతున్నా ప్రశ్నించాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తుందనే విమర్శలు విన వస్తున్నాయి. అధికారుల అలసత్వం కారణంగా మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు, శ్రీనగర్, రావిర్యాల, మంఖాల్, ఇమామ్‌గూడలో జోరుగా మట్టి దందా సాగుతుంది. దీని కోసం వ్యాపారులు ముఠాలుగా ఏర్పడి యథేచ్ఛగా మొరం తవ్వి రూ. లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంలో అడ్డూ అదుపు లేకుండా తవ్వకాలు చేపట్టడంతో అవి చెరువులను తలపిస్తున్నాయి.

టిప్పర్ల సహాయంతో డంప్..

శ్రీశైలం హైవేకు కూతవేటు దూరంలో తుమ్మలూరు, మంఖాల్, శ్రీనగర్ రెవెన్యూ పరిధి ప్రభుత్వ, ఫారెస్టు, అసైన్డ్ భూముల్లో కొన్ని రోజుల నుంచి మట్టి తవ్వకాలు జోరుగా సాగుతుంది. రాత్రి సమయంలో మట్టి తవ్వకాలు జరిపి టిప్పర్ల ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ ఈ–సిటీ కమాన్ వద్ద డంప్ చేస్తున్నారు. రాత్రి డంప్ చేసి ఉదయం నగరంతో పాటు, తుక్కుగూడ, తుర్కయంజాల్, ఆదిబట్ల తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోజుకు వందల్లో టిప్పర్లలో రవాణా చేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.5వేల నుంచి రూ.6,500 వరకు విక్రయిస్తూ లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు.



క్రేన్‌తో లారీలో నింపుతున్న మట్టి

మట్టిని బట్టి, మార్కెట్‌లో డిమాండ్ ఉంది. హైవే రోడ్డుపై మట్టి వ్యాపారం జోరుగా సాగుతున్న రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రిందట మహేశ్వరం, కందుకూరు మండలంలో ఎస్ఓటీ అధికారులు మట్టి మాఫియాపై దాడులు చేశారు. కానీ ఈ మట్టి కేంద్రాలపై దాడులు చేయక పోవడం అనుమానాలకు తావిస్తుంది. ఈ వ్యాపారం వెనుక రాజకీయ నాయకులతో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడి, మట్టి వ్యాపారుల ఆగడాలను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

మట్టి తవ్వకాలు చట్ట రీత్యా నేరం. దీన్ని నివారించడానికి రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను మరింత పకడ్బందిగా ఏర్పాటు చేస్తాం. ఈ వ్యాపారంలో ఎంతటి వారు ఉన్నా సరే కఠిన చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, తహసీల్దార్, మహేశ్వరం

పర్యావరణహిత రంగులు వాడాలి

ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆదిబట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కలిసి మెలిసి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. కెమికల్ రంగులకు బదులు సంప్రదాయ రంగులు(పర్యావరణానికి హాని కలిగించని) వాడాలని సూచించారు. ఎదుటివారికి ఇబ్బంది కలిగించవద్దన్నారు. యువత వాహనాలను వేగంగా నడపవద్దన్నారు. ప్రార్థన మందిరాల వద్ద రంగులు చల్లవద్దన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

మాజీ సర్పంచ్ శ్రీశైలం

తలకొండపల్లి: మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకురావాలని మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్ సాయికుమార్‌ను కోరారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉపాధి తదితర అనేక రంగాల్లో మత్స్యకారులు వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్‌గా సాయికుమార్ ఇటీవల నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో సాయి కుమార్‌ను శ్రీశైలం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వాలు మత్స్యకారుల అభివృద్ధికి ఏలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 28న స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. స్వామి పెళ్లికి రావాలని, బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మెట్టు సాయి కుమార్‌కు శ్రీశైలం అందజేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



గోడలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 140 డబుల్ బెడ్రూమ్స్ పక్కన ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేసి ప్రీకాస్ట్ గోడను నిర్మించారు. ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, పోలీసుల సహాయంతో జేసీబీలతో అక్రమ నిర్మాణాలను తొలగింపజేశారు. అనంతరం ఆర్డీఓ సూరజ్ కుమార్ మాట్లాడుతూ మన్సాన్‌పల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 140లోని భూమి మొత్తం ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎంతటి వారికైనా చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలానికి చెందిన కొందరు చేసిన ఫిర్యాదు మేరకు తాము అప్రమత్తమయ్యామన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి రక్షణకు కంచె ఏర్పాటు చేసి బోర్డులు పాతిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బందితో గట్టి నిఘా ఏర్పాటు చేసి భూములను కాపాడుతామని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: సీఎం సహాయ నిధి పేదలకు వరమని మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితారెడ్డి పేర్కొన్నారు. కందుకూరు మండలం బైరాగిగూడ గ్రామానికి చెందిన ఎలిమినేటి మంగమ్మకు రూ. 54వేల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకునేందుకు ఈ నిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురసాని సురేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మీ నర్సింహారెడ్డి, ఎండి దావూద్, పలుస కృష్ణ గౌడ్, మహ్మద్ సర్వర్, అందుగుల సురేందర్, రాజు, అనిల్ పలువురు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మల్లు రవికి బొకే ఇచ్చి అభినందిస్తున్న మాల బ్యాగరి, కాటికాపరుల సంఘం

మహేశ్వరం: మాల, బ్యాగరి కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో శ్మశానవాటికలను కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రతి కాటికాపరికి ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, కనీస వేతనం రూ. 25వేలు, ఒక్కొక్కరికి రూ.10 లక్షల బీమా కల్పించాలన్నారు. తమ సమస్యలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చాలని కోరారు. ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని మల్లు రవి బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాగరి కాటికాపరుల జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవులు, జిల్లా అధ్యక్షుడు గాదె సత్తయ్య, శేఖర్, నగేశ్, మద్దిలేటి, నాగరాజు, సురేందర్, రాజు, నర్సింహ, మోహన్, సుదాకర్ పలువురు పాల్గొన్నారు.

కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- కాంగ్రెస్ గూటికి కృష్ణాగౌడ్

హయత్‌నగర్: బీఆర్‌ఎస్ సీనియర్ నేత, జిల్లా పరిషత్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ నోముల కృష్ణాగౌడ్ కాంగ్రెస్ గూటికి చేరారు. ఆయనతో పాటు తుర్కయాంజాల్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు కీర్తనారెడ్డి, మాధవి.. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వంద రోజుల పాలనలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసే పెద్ద సంఖ్యలో నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం అన్నారు. కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు.

అవినీతిపై ఉక్కుపాదం

నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, మండల అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని.. ఎక్కడైనా అవినీతి జరిగినట్లు తేలితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సుమారు వంద కోట్ల రూపాయలు వరకు తీసుకొస్తానని, ఇప్పటికే దీనిపై సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. మున్సిపాలిటీల్లో అభివృద్ధిని నిత్యం పర్యవేక్షిస్తున్నామని, ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కౌన్సిలర్లు ఉదయశ్రీ, కవిత, నాయకులు.. శంకరయ్య, శివ కుమార్, అశోక్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు



రావిర్యాల శ్రీ కంఠమహేశ్వరం స్వామి ఆలయం

- నేటి నుంచి స్థిర ప్రతిష్ఠాపనోత్సవాలు
- శివలింగం, గణపతి, పార్వతి, వనం ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠ
- ఏర్పాట్లు పూర్తి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సురమాంబ సమేత కంఠ మహేశ్వర స్వామి ఆలయమును గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించారు. ఈ ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు విగ్రహ, స్థిర ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సూరమాంబ సమేత కంఠ మహేశ్వర శివలింగం, గణపతి, పార్వతి, వనం ఎల్లమ్మ, మైసమ్మ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. శివపార్వతుల కల్యాణం, బోనాలు, యజ్ఞ యాగాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పూజా కార్యక్రమాలు ఇలా..

సోమవారం మహాగణపతి పూజ, పుణ్యాహవాచన, గౌడ భక్తులకు విభూది పంచమహారుద్రాక్ష మాలాధారణ, గణపతి పూజ, దీపారాధన ప్రతిష్ఠ ప్రారంభం.

- 26న గోపూజనము, అగ్రోదకము, గణపతిపూజ, అగ్ని ప్రతిష్ఠాపనము దీక్ష హోమము, లక్ష్మిగణపతి హోమం, నవగ్రహ హోమం తదితర కార్యక్రమాల నిర్వహణ. శివలింగ, గణపతి, పార్వతి, ఎల్లమ్మ, మైసమ్మ ప్రతిష్ఠాపన విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం.
- 27న హోమం, మంగళహారతి తీర్థప్రసాద వితరణ
- 28న ఆలయంలో వేదపండితులు వేదోచ్ఛరణ మధ్య విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, హోమం
- 29న సాయంత్రం సురమాంబ నాటక ప్రదర్శన
- 30న గ్రామ దేవతలకు పూజలు, అష్టదిగ్బంధన, బంధువులచే ఒడి బియ్యం, బోనాలు, రాత్రి శివపార్వతుల కల్యాణం
- 31న ఘటం పూజ, మోకు ముస్తాదులకు పూజ, గౌడ భక్తుల మాల విరమణతో ఉత్సవాలు ముగింపు.





ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న నంది, శివలింగం

ఆత్మరక్షణకు కరాటే దోహదం

షాద్‌నగర్: కరాటే, కుంగ్‌ఫూ లాంటి యుద్ధ విద్యలు ఆత్మరక్షణకు ఎంతో దోహదపడతాయని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బృందావన్ కాలనీలో న్యూ మాంక్స్ కుంగ్ ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో యుద్ధ విద్యలు నేర్చుకోవడం అంతే ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మరక్షణ కోసం విధిగా కరాటే, కుంగ్‌ఫూ లాంటి యుద్ధ విద్యలను అభ్యసించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు యుద్ధ విద్యల్లో విధిగా శిక్షణ ఇప్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ మాస్టర్ నక్క బాల్‌రాజ్, కౌన్సిలర్ లతాశ్రీశైలంగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో అఖండ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్ ఆధ్వర్యంలో సుమారు వందమంది బీఆర్‌ఎస్ నేతలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి నెరవేస్తున్నారన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

మహేశ్వరం: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కందుకూరు మండల పరిధిలోని ఆగర్‌మియా గూడ గ్రామంలో ఏపీఎల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యాన్ని, మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రతి రోజు కొంత సమయం క్రీడలు, వ్యాయమానికి కేటాయించాలన్నారు. ఏపీఎల్ పోటీల మాదిరిగానే ఆగర్‌మియాగూడ ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలను గ్రామ యువత, క్రీడాకారులు నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, క్రీడాకారులు జంగారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రవి, సంతోష్‌రెడ్డి, ప్రవీణ్ యాదవ్, అజయ్ యాదవ్, వినిష్, తరుణ్, శ్రీను పలువురు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్: క్రీడలతో ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్)టోర్నమెంట్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చిగురింత పారిజాత మాట్లాడుతూ మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. నేటి సమాజంలో యువకులు దారి తప్పకుండా క్రీడలు, ఇతర ఆటలపై దృష్టి పెట్టడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రొటోకాల్ కార్యదర్శి బంగారి బాబు, స్థానికులు యెల్చల పురుషోత్తంరెడ్డి, సుభాన్‌యాదవ్, సుభాష్‌రెడ్డి, విజయ్, హరి, అనీల్, రజని, హరీశ్ పాల్గొన్నారు.



మహేశ్వరం: పోటీలను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రేవంత్‌రెడ్డి